# పునరావృత్తం

కాలెపు శివశేఖర్

**ఒక ప్రక్క నా చదువు పదిసంవత్సరాలలో వుండగా, మరో ప్రక్క మా ప్రేమ తీరాల వెంబడి పరుగులెత్తింది ప్రేమ ఫలించాలంటే పెళ్ళి చేసుకోవాలి. పెళ్ళి చేసుకోవాలంటే నా చదువు అవ్వాలి. చదువు వెంటనే కూడు పెట్టదు కనుక వుద్యోగం కోసం వెతుక్కోవాలి.**

ఎప్పుడో చేసిన పాపం యిప్పుడు కళ్ళ ఎదుట శాపంగా నిలిచిపోయింది.

ఆమె రూపం దీనంగా కనిపిస్తోంది.

గుండెల్లో గాయం రేగింది.

నేను చేసింది తప్పే కావచ్చు.

కానీ—నేనూ మనిషినే.... నాకు మనసుంది. ఆ మనసుకు బాధపడే గుణం వుంది.

అందుకే యీ వ్యథ.

నిన్న సాయంత్రం ఆఫీసు నుంచి వస్తుంటే ఆమె బస్ స్టాప్‌లో కనిపించింది.

యాదృచ్ఛికంగా ఆమెవేపు చూసి స్తంభించి పోయాను.

నోట మాటరాక, చూపులు నిలిచి పోయాయి.

అదే సమయంలో ఆమె నా వేపు చూడటం జరిగింది.

ఆమె మొహంలో ఆశ్చర్యమే వుందో, అసహ్యమే వుందో తెలుసుకోలేకపోయాను.

నా జీవితంలో యిటువంటి సమయం వుంటుందని.... ఆ సమయం యింత భయంకరంగా, యింత బాధాకరంగా వుంటుందని నేనేనాడు వూహించలేదు.

ఆరేళ్ళ తరువాత ఏమిటీ కలయిక

ఈ కలయిక కలకాదు వాస్తవం.

ముందుగా ఎవర్ని ఎవరు పలకరించుకోవాలి—?

నాలో సందిగ్ధం....

ఆమెలో సంశయం....

మా యిద్దరిలో సమాధానం శూన్యం.

ఏదో మాట్లాడాలని పెదవులు కదులుతున్నాయి.

మాట రావడంలేదు.

ఆమె కళ్ళల్లో సన్నటి కన్నీటిపొర—తల దించేసుకుంది.

ఆమె బాధపడుతుందా—?

గతం గుర్తొచ్చిందా—?

పలకరించకుండా ఎక్కువ సమయం వుండటం మంచిది కాదనిపించింది. గుండెని చిక్కబట్టుకొని, గొంతులోకి మాట తెచ్చుకొని.

బలవంతంగా పెదవుల్ని కదిలించాను "మా....ధు....రి" అన్నాను.

ఆమె తలెత్తి చూసింది.

ఆమె కళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్నాయి. కర్చీఫ్‌తో వత్తుకుంది.

"ఎన్నాళ్ళయింది యీ వూరొచ్చి"

ఆమె సమాధానం చెప్పలేదు.

బహుశా దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తుందేమో—

ఈ పరిస్థితిలో ఆమె మాట్లాడలేదనిపించింది.

"అలా పార్కులో కూర్చుందాం"

ఆమె అక్కణ్ణుంచి కదల్లేదు.

మా ముందు బస్ ఆగింది.

జనం దిగుతున్నారు. ఎక్కుతున్నారు.

మేం అక్కడే నిలబడి పోయాం—బస్ వెళ్ళిపోయింది.

"మాధురి....రాలేవా—?"

ఆమె మెల్లిగా అడుగులు వేసింది.

నేను ముందుకు కదిలాను—నా వెనుక మౌనంగా ఆమె—

పార్కులో ఓ మూలగా కూర్చున్నాం

సూర్యుడు పడమర వాలిపోతున్నాడు.

ఆకాశంలో పక్షుల గుంపులు

పార్కులో ప్రేమ జంటలు

ఆమె వేపు పరీక్షగా చూశాను.

అప్పటికీ యిప్పటికీ ఆమెలో మార్పు రాలేదు.

కానీ—పెదవులమీద చిరునవ్వు కనిపించలేదు.

మెడలో తాళి లేదు.

అంటే మాధురి పెళ్ళి చేసుకోలేదా—? పెళ్ళికాలేదా—?

"ఎన్నాళ్ళయింది యిక్కడికి వచ్చి"

"మూడు నెలలవుతోంది"

"ఎక్కడుంటున్నావ్....ఏం చేస్తున్నావ్?"

"గాంధీనగర్‌లో....శైలజ ఎంటర్‌ప్రైజస్‌లో జాబ్ చేస్తున్నాను".

ఇంకేం అడగాలో అర్థం కాలేదు.

మాటలు కరువై పోయాయి.

ఎన్నో ప్రశ్నలు గొంతులోనే ఆగిపోయాయి.

ఆమె మౌనంగా వుండిపోయింది.

రెండు నిమిషాల అనంతరం అన్నాను" మళ్ళీ నీవు కనిపిస్తావనుకోలేదు మాధురి"

"నేనూ అనుకోలేదు"

"బాధ పడుతున్నావా?"

"అది నాకు అలవాటయి పోయింది"

"వేదాంతమా?"

"కాదు.... వేదన"

"క్షమించు మాధురి ఆనాటి పరిస్థితులు అలా వచ్చాయ్"

"ఏమైతేనే నీ పరిస్థితులకు నేను బలైపోయాను.

"నన్ను అసహ్యించుకుంటున్నావు కదూ?"

"అవును.... నువ్వు కనిపిస్తే హత్య చేయాలన్నంత కసి వుంది నాలో.... యీనాడు నువ్వు కనిపించావు.... ఎందుకో ఆ పని చేయలేకపోతున్నాను.... మళ్ళీ ఎందుకు కని

పించావు. ప్లీజ్ వను.... యింకెప్పుడూ నాకు కనిపించకు. నువ్వొక మూర్ఖుడివి.... మోస గాడివి.... యు ఆర్ ఎ ఛీట్...." ఆమె ఆవేశంగా లేచింది.

"కూర్చో మాధురి"

"ఇప్పటికే ఆలశ్యమయింది. ఒకటి మాత్రం గుర్తుంచుకో నిన్ను నా జీవితంలో ఎప్పటికీ క్షమించను.... ఐ హేట్ యు...." ఆమె వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపోయింది:

సూర్యుడు పూర్తిగా అస్తమించాడు.

లోకం మీద చీకటి పరుచుకొంటోంది.

పార్కులో లైటు వెలిగాయి.

నాలో చీకటి.... వెలుతురు రాదు.



చాలా సేపు అక్కడే కూర్చుండిపోయాను.

ఎప్పటికో యిలు చేరుకున్నాను.

ఆకలిగా లేదు. మంచంమీద వాలిపోయాను.

ఈ యింట్లో నేను ఒంటరిని

నా బ్రతుకు ఎడారి

యింకా ఎంతకాలం యీ ఒంటరి ఎడారి బ్రతుకు—?

నాకింటూ ఎవరూ లేకుండా పోయారు.

ఎందుకో భోరున ఏడ్వాలనిపించింది.

నా వేదన ఎవరికి కనిపిస్తాది.

నా రోదన ఎవరికి వినిపిస్తాది.

మాధురి.... మాధురి.... కలవరించాను.

ఆమెను వాంఛించాను.

ఆమెకు నేనంటే అసహ్యం.

ఆరేళ్ళ క్రితం గతం అది.

చదువుకున్నప్పుడు మాధురి యింట్లో అద్దె కుండేవాణ్ని. వయసు వెల్లువలో మాధురి అల్లరిగా తిరుగుతూ కనిపించేది.

నాలో పురకలు వేస్తున్న యవ్వనం ఆమె మీద కోరికను పెంచేసింది.

ఆ కోరిక నన్ను రోజురోజుకీ కాల్చేసింది.

కాంక్ష నిండిన కళ్ళతో ఆమె వేపు వాంఛగా చూసేవాణ్ని.

నా చూపులకు అర్థాలు తెలియని వెర్రిది కాదు మాధురి.

నన్ను చూసి నవ్వుతుండేదామె.

ఆడదాని ఒక్కనవ్వు చాలు మగవాడు తెగించడానికి.

తను తెగించేసాడు

ఓ సాయంత్రం ఆమె బావి దగర నీళ్ళు తోడుతుంటే తను ప్రక్కకుచేరి "మాధురీ నన్ను చూసి ఎందుకలా నవ్వుతావ్" అన్నాను.

"మీరు నావేపు ఎందుకలా చూస్తారు—?"

"నువ్వంటే నా కిష్టం మాధురి"

ఆమె కిలకిలా నవ్వింది.

"ఎందుకలా నవ్వుతావ్"

"ఈ మాట యింత ఆలస్యంగా చెప్తున్నందుకు...."

ఆమె చేతిని చిన్నగా నొక్కాను.

ఆమె మెల్లిగా చేయి విడిపించుకొని నీళ్ళ బిందెతో లోనికెళ్ళిపోయింది.

ఆమె అంగీకారం.... నాలో ఆనందం

మా యిద్దరి మధ్య చూపులు.... నవ్వులూ పాతబడిపోయాక— ఓ వెన్నెల రాత్రి, అనుభవానికి అవకాశం వచ్చింది.

పెరట్లో మల్లె పందిరి చాటు మాకు చోటయింది.

మాకింకా పెళ్ళి కాలేదని....

మా మధ్య హద్దులు.... మా చుట్టూ పరిధులు వున్నాయనే సంగతి మరచిపోయి పెళ్ళి కాకుండానే హద్దుల్ని వెనక్కి నెట్టి.... పరిధులుదాటి.... కలవకూడని కలయికలో కలిసిపోయాము.

ఇది ప్రేమ లేక మరేదో నాకు తెలిసేదికాదు,

పగలు ఆమె నావేపు చూసి నవ్వుతున్నప్పుడు అది ప్రేమ అనుకున్నాను.

రాత్రి ఆమె నాచెంత చేరినప్పుడు మరేదో అనుకున్నాను.

ఇలా అనుకొని అలవాటుపడ్డాక ఆ అనుభవాన్ని వదులుకోలేకపోయాము. మాధురి నా స్వంతం అనుకుని ఏదో గర్వంగాఫీలయ్యాను.

ఒక ప్రక్క నా చదువు నడిసముద్రంలో వుండగా. మరో ప్రక్క మా ప్రేమ తీరాల వెంబడి పరుగులెత్తింది.

ప్రేమ ఫలించాలంటే పెళ్ళి చేసుకోవాలి.

పెళ్ళి చేసుకోవాలంటే నా చదువు అవ్వాలి.

చదువు వెంటనే కూడు పెట్టదు కనుక వుద్యోగంకోసం వెతుక్కోవాలి.

ఆమెను పెళ్ళిచెసుకొని కూడు పెట్టని కాపురాన్ని ఎలా చేయను ?

నాకంటూ నీడలేకుండా తోడు ఎలా తెచ్చుకోను ?

ఇవన్నీ ముందే ఆలోచించివుంటే. నేను ఆమెవేపు కన్నెత్తి చూసివుండేవాడ్ని కానేమో?

కానీ ఏదైతే జరగకూడదనుకున్నానో అదే జరిగిపోయింది.

మాధురి చెప్పినమాట, నా మతిని పోగొట్టేసింది.

నెత్తిన నిప్పుల వర్షం కురిసింది.

"నేను నెల తప్పాను" అని ఆమె భోరున ఏడ్చింది.

నాకూ ఏడుపొచ్చి హోరున ఏడ్చేసాను.

ఆమె ఏడుపుకి కారణం వెంటనే తనని పెళ్ళిచేసుకోమని.

నా ఏడుపుకి కారణం వెంటనే నిన్ను పెళ్ళి చేసుకోలేనని.

"రేపే మీరు నాన్నగారితో మాట్లాడండి" అని ఆమె బండెడు భారం నెత్తిమీదవేసి వెళ్ళిపోయింది.



## విలువ

"లక్షరూపాయల ఖరీదుచేసే నిక్షేపంలాంటి ఇల్లు. యాభై వేలకు ఇచ్చేస్తానన్నా ఎవరూ కొనడానికి ముందుకు రావడంలేదు...." బాధగా అన్నాడు బాలయ్య. వెంకయ్యతో.

"ఏం? దెయ్యాలేమైనా తిరుగుతున్నాయా ?...." అడిగాడు వెంకయ్య

"అబ్బే.... అదేం కాదు; ప్రక్కనే ఓ హార్మోనిస్ట్ సొంత ఇల్లుంది లే .." అన్నాడు బాలయ్య.

—ఎన్. మురళీమోహన్ (నరసన్నపేట)

ఆ రాత్రి నిద్రపట్టక నరకయాతన్నే అనుభవించి నరకాన్నే చూశాను.

నా తల్లి దండ్రులకు నా మీద అచంచల విశ్వాసముంది.

నేను ఎంతడిగితే అంత డబ్బు పంపించి నన్ను చదివిస్తున్నారు.

నామీద ఎన్నో ఆశల్ని పెంచుకున్నారు.

నేను మాధుర్ని పెళ్ళి చేసుకుంటానంటే నా వాళ్ళు నన్ను గుమ్మం ఎక్కనిస్తారా? చస్తే ఎక్కనివ్వరు.

నేను మా యింటి గుమ్మం ఎక్కాలంటే తక్షణం నేను యీ యింటి గుమ్మందాటేయాలి ఎలా?

రాత్రికి రాత్రే పారిపోతే ఆమెవాళ్ళకి అనుమానం రావచ్చు

ఆ మర్నాడు కాలేజీకి వెళ్ళకుండా వూరంతా రూమ్కోసం గాలించాను. మొత్తానికి రూమ్ దొరికింది. కొంత అడ్వాన్సుయిచ్చేసి వచ్చాను.

ఆ రాత్రి మాధురి మళ్ళీ నన్ను కలిసింది.

ఓనాడు మాధురి యింట్లో లేని సమయం చూచి యిల్లు ఖాళీచేసి వచ్చేశాను.


మాధురి నన్ను వెతుక్కుంటూ వస్తుందేమో వచ్చి నన్ను పిలేస్తుందేమోనని భయపడాను.

నేను భయపడ్డట్టు మళ్ళీ ఆమె నాకు కనిపించలేదు.

ఆ ఏడాదితో నా చదువు పూర్తయిపోయి. ఆ వూర్ని వదిలేశాను.

అటు తరువాత మాధురి ఏమయింది?

ఆమె ప్రెగ్నెంట్ విషయం బయటపడిందా?





## సంతోషం

కాపనించి భార్య వినయమణికి ఉత్తరం రాశాడు విశ్వేశ్వరరావు. దానికి ఆమెకు జవాబు రాసింది.

'మీ ఉత్తరం అందింది. సంతోషం... ముఖ్యంగా కవరుమీద మీరు అతికించిన స్టాంప్‌మీద ముద్ర పడనందుకు....'

—కిషన్ (హైద్రాబాద్)

ఆమె యింట్లోవాళ్ళు ఏమన్నారు?

గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్ చేయించి, పెళ్ళిచేశారా?

అనేకమైనసందేహాలకు నాకు సమాధానాలు తెలీలేదు.

చాలాసార్లు ఆమెను తలుచుకొని బాధ పడ్డాను.

ఎప్పుడైనా ఆమె కనిపిస్తే 'నన్ను క్షమించు మాధురి అని చెప్పాలనుకున్నాను.

ఆమె కనిపించలేదు.

ఆమె గురించి ఆలోచిస్తూ.... ఆమె తలపుల్ని నెమరువేసుకుంటూ యిన్నేళ్ళు కాలం గడిపేశాను.

ఆమెకోసమేనేమో పెళ్ళి చేసుకోకుండా వుండిపోయాను

ఆమె నన్ను క్షమిస్తుందా? ఏమో?

వారంరోజుల తరువాత 'శైలజ ఎంటర్‌ప్రైజెస్ ముందు ఓ సాయంత్రం పూట మాధురికోసం నిలబడాను.

మరి కొద్దిసేపట్లో ఆమె ఆఫీసునుంచి బయటకు వచ్చింది.

నన్ను చూసి మొహం చిట్లించింది.

"నీతో మాట్లాడాలి మాధురి" అన్నాను.

"ఎందుకు?"

"ఈ నడిరోడ్డుమీద ఎలా చెప్పమంటావ్"

"పర్వాలేదు"

"నువ్వు నన్ను క్షమించి, అంగీకరిస్తే నిన్ను పెళ్ళి చేసుకుంటాను"

"ఇంకా నా మీద వ్యామోహం పోలేదన్న మాట"

"నేను చెపుతుంది నిజం మాధురి"

ఆమె మాట్లాడలేదు.

"నామీద నమ్మకం కలగడంలేదా? నువ్వు సుఖపడటమే నాక్కావాలి. నీ సుఖంకోస నేను ఏమయినా చేస్తాను"

"నువ్వా సిటీ బస్ క్రింద పడటం నాకు సుఖం. పడగలవా?"

చెంపమీద కొట్టినట్లనిపించింది ఆమె మాట

"నా సుఖం కోసం ఏమయినా చేస్తావు కదూ?"

"చేస్తాను"

ఆమె ఓ నిమిషం ఆలోచించి అంది. "రేపు సాయంత్రం ఆరు గంటలకు ఓసారి బారేజి దగ్గరకు రా...అక్కడ నా నిర్ణయం తెలియ చేస్తాను"

నాలో ఎక్కడో ఆనందం వెల్లివిరిసింది.

బస్ వచ్చి ఆగింది—ఆమె ఎక్కింది.

మర్నాడు అయిదున్నరకే బ్యారేజ్ చేరుకున్నాను.

చల్లగా గాలి వీస్తోంది—కృష్ణలో నీళ్ళు రొదచేస్తూ ప్రవహిస్తున్నాయ్.

ఆమె తప్పకుండా పెళ్ళికి అంగీకరిస్తుంది. తనని ఆమె ఎంతగా ప్రేమించిందో తనకి తెలుసు.

తనంటే ఆమెకు ప్రాణం.

ఆ నాడు మాధురి బిడ్డను కన్నదా—?

కని వుంటే తనకిప్పుడు అయిదేళ్ళ బాబో, పాపో వుండి వుండాలి.

తను ఒక బిడ్డ తండ్రా—? ఈ వూహ ఎంత ఆనందంగావుంది. ఇదే నిజమైతే తనంత అదృష్టవంతుడు మరొకడు వుండడు.

తను వెళ్ళిపోయిననాడు, ఆమె ఎంతగా విలపించి వుంటుందో....తనకోసం నిరీక్షించి.. నిరీక్షించి....ఎంతకాలం ఎదురు తెన్నులు చూసిందో.

ఆలోచిస్తూ రోడ్డు మీదకు చూశాను.

మాధురి వస్తూ కనిపించింది.

నా కళ్ళలో కాంతి రేకల వెలుగులు....

మాధురి

తన మాధురి

ఎవరు—?

ఆమె ప్రక్క ఎవరు—?

ఎవరో మగాడు.

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ తన వేపే వస్తున్నారు.

అతను అందంగా, చామన ఛాయగా ఆకర్షణీయంగా వున్నాడు.

వాళ్ళు జంటగా నడిచి వస్తుంటే తనకెందుకో ఏదోలావుంది.

వచ్చేశారు.

మాధురి నన్నుచూసి నవ్వింది.

అతన్ని నాకు పరిచయం చేసింది.

అతని పేరు శంకర్రావు—ఆమె ఆఫీసులోనే పని చేస్తున్నాడట

అయితే, అతన్ని నాకు పరిచయం చేయ






మేమిటి—? ఇక్కడికెందుకు తీసుకొచ్చినట్లు?

ఆమె అంది "నేను పెళ్ళి చేసుకుంటున్నాను"

ఆ మాటకు అర్థం "నేనూ, శంకర్రావు పెళ్ళి చేసుకోబోతున్నాం" అని.

నా గుండెలు పగిలిపోయాయి.

ఆమె మాటలు నన్ను గాయపరిచాయో లేక అవమాన పరిచాయో తెలియని అయోమయం-అవ్యక్తం కాని వ్యధతో నలిగిపోయాను.

బ్యారేజ్ మీంచి దూకి చనిపోవాలని పించింది.

"ఇది....చెప్పడానికేనా నన్ను పిలిచావ్....సంతోషం....ఐ యామ్ వెరి ఎక్స్ట్రీమ్‌లీ హాపీ.... వస్తా" నా కళ్ళలో నీళ్ళు నీళ్ళు తిరుగుతుంటే వేగంగా పరుగు లాంటి నడకతో యింటికి చేరుకున్నాను.

మంచంమీద పడి భోరున ఏడ్చేశాను:

గుండెలు కుదుటపడ్డాక ఆలోచిస్తే, మాధురి చాలా తెలివైనదనిపించింది. ఎంత తెలివిగా దెబ్బతీసింది.

ఇంతకంటే అవమానం యింకేంవుంది.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

సిగరెట్లు తగల బడుతున్నాయ్.

గదిలో పొగ

మదిలో పగ

పగ....ఎవరిమీద....ఎందుకింత కసి—?

నా గుండెలు మండుతున్నాయ్.

హృదయం తగలబడుతోంది.

తల పగిలిపోతోంది.

స్మృతి పథంలో మాధురి పగలబడి నవ్వుతోంది.

శంకర్రావు ఆమెను పెళ్ళి చేసుకుంటాడా?

ఎలా చేసుకుంటాడు—?

ఆమె గతం చెడిన జీవితం అని అతనికి తెలుసా—?

తెలిస్తే పెళ్ళి చేసుకోగలడా—? లేదు.

ఆమె గురించి అతనికి తెలీదు.

తన గురించి ఆమె చెప్పుకోదు.

ఎందుకో నవ్వొస్తోంది.

నవ్వుకున్నాడు.

తన నవ్వులో ఆమె బ్రతుకు నవ్వులపాలు కాబోతోంది.

మాధురికి అతనితో పెళ్ళికాదు.

తెల్లారి ఆఫీసునుంచి శైలజా ఎంటర్ ప్రైజెస్‌కి ఫోన్ చేశాను.

శంకర్రావు లైన్లో కొచ్చాడు.

"నేను మీతో మాట్లాడాలి. సాయంత్రం ఆరు గంటలకు బ్యారేజి దగ్గరకు రండి" అనేసి ఫోన్ డిస్కనెక్ట్ చేసేశాను.

నేను చేస్తోంది తప్పా?

తప్పే!

అంతరాత్మ నిలేసి అడుగుతోంది.

దానికి సమాధానం చెప్పాలనిపించలేదు.

సాయంత్రం బ్యారేజీ దగ్గర శంకర్రావు కలిశాడు.

"మీరు మాధురిని పెళ్ళి చేసుకోబోతున్నారా?"

"అవును"

"ఆమె గతం మీకు తెలుసా?"

"తెలీదు"

"నేను చెపుతా వినండి....పూర్తిగా విన్నాక అప్పటికి కూడా మీరు ఆమెను పెళ్ళి చేసుకోదలిస్తే నాకేమీ అభ్యంతరం లేదు"

శంకర్రావుకి అంతా చెప్పాను.

మా ఇద్దరి సహవాసం. పాపానికి కలిగిన ఓ బిడ్డ కూడా వున్నట్టు చెప్పాను.

ఇప్పుడు శంకర్రావు మొహం ఎర్రబడింది.

పాపం! ఆమెమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో, మరెన్ని కలలు కన్నాడో?

ఇప్పుడు చెప్పండి శంకర్రావుగారు ఆమెను పెళ్ళి చేసుకుంటారా?"

"లేను....ఆ వూహే భరించలేక పోతున్నాను. నాకు నిజం తెలియచేసి....బురదలో పడబోతున్న నన్ను రక్షించారు....మీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలీడం లేదు"

నేను చిన్నగా నవ్వాను

శంకర్రావు వెళ్ళిపోయాడు.

నా మనసులో ఏదో ప్రశాంతత నెల



## వయసు

ప్రఖ్యాత చిత్రకారుడు పికాసోని ఓ యువతి ఇంటర్వ్యూ చేసింది.

"ముప్పయి ఏళ్ళు దాటిన ఆడవాళ్ళు ముప్పయి ఏళ్ళు దాటిన మగవాళ్ళకన్నా ముసలివాళ్ళలా కన్పిస్తారెందుకని?"

"ఎందుకంటే ముప్పైఏళ్ళ ఆడవారి వయసు నిజానికి నలభై గనక" చెప్పాడు పికాసో.

—కిషన (హైద్రాబాద్)



**బావుంది**

పెళ్ళివారికి ఇల్లుచూపించాడు జగపతి.
"మీ ఇలు చూశాం. చాలా బావుంది. ఇంతకీ మీ అబ్బాయి ఏంపని చేస్తున్నాడు ?" అడిగాడు రఘుపతి.
"తాపీపని" చెప్పాడు పెళ్ళికొడుకు తండ్రి జగపతి.

—ఎమ్. ప్రసాదు (విశాఖపట్నం)

కొన్నది.
ఏదో సాధించాననే సంతోషం.
మాధురి బ్రతుకికి ఇక గతిలేదు.
తనే ఆమెకు గతి....పతి
వచ్చినట్లు కాళ్ళ దగ్గరకు వచ్చి తీస్తుంది.
చీకట్లు ముసురుకుంటున్నాయ్.
నాకాళ్ళు బ్రాంది షాపుముందు ఆగిపోయాయి.
నా కళ్ళు బాటిల్స్‌వేపు ఆశగా చూశాయి.
బేగ్ పైపర్ విస్కీ అఫ్‌బాటిల్ ప్యాక్ చేయించాను.
ఇంటికి చేరుకున్నాను.
తాగుతున్నాను పిచ్చిగా....మత్తు తలకెక్కి తల తిరుగుతోంది.
కళ్ళ ముందు మసక పొరలు.
రాత్రి టయమెంతయిందో తెలీదు.
వాచీలో ముల్లులు ఏది ఏమిటో కనిపించడం లేదు.
తలుపు ఎవరో కొడుతున్నారు.
తూలుతూ వెళ్ళి తలుపు తీశాను.
ఎదురుగా....ఎవరు ...మసగ్గా....
ఎదురుగా....ఎవరు....ఆకారం....
ఎదురుగా....ఎవరు....మనిషే....
కళ్లు నలుముకొని తల విదిలించి చూశాను.
మాధురి!
అవును మాధురే
ఇక్కడికెలా వచ్చింది!
తన ఇంటి అడ్రసు ఎలా తెలిసింది.
ఆమె లోనికి అడుగు పెట్టింది.
ఆమె కళ్ళలో నిప్పుకణాలు.
తనకెక్కిన నిషా దిగిపోయినట్లయింది.
నన్ను నేను కంట్రోల్ చేసుకుంటున్నాను.

"శంకర్రావు గార్కి మనగతం చెప్పావా?" ఆమె సూటి ప్రశ్న.
"లే....లే....లేదు....ఊహుం....చె..ప్పా..ను...."
"ఎందుకు చెప్పావ్ "
"ఏమో"
"నా సుఖాన్నికోరే మనిషివికదు నీవు"
"అవును....నీవు మరొకరితో సుఖపడటం నాకిష్టం లేదు....నీ సుఖం నాతోనే....నీ జీవితం నాతోనే....నీవన్నీ నాతోనే...."
"నిషా తలకెక్కిందా....నీకు తలకెక్కింది నిషాకాదు విషం. నువ్వొక విషప్పురుగువని నాకు తెలుసు....నువ్వొక మూర్ఖుడివి....ఏ్రాసివి ...నీ బుద్ధి కోతిబుద్ధి"
"నోర్ముయ్....నిన్ను నేను పెళ్ళి చేసుకుంటానని చెప్పినందుకు నన్ను అవమానించావ్"
"నిజమే....నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటానన్నందుకు ఎంతో సంతోషించాను....పొంగిపోయాను....ఎందుకో తెలుసా నేను ఇంకా ఇంకా నిన్ను ప్రేమిస్తున్నందుకు. కాని ఒకసారి నిన్ను ప్రేమించి మోసపోయాను. మరోసారి మోసపోకూడదనుకున్నాను. నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవడం ఎంత వరకు నిజమో....నువ్వెంతగా నా సుఖాన్ని కోరుకుంటున్నావో తేల్చుకోవాలనుకున్నాను...."
ఆమెమాటలు వింతగా, కొత్తగావున్నాయి.
"నువ్వు నిజంగా నా సుఖంకోరేవాడివయితే నేను ఎవర్ని చేసుకున్నా సంతోషించే వాడివే—నీ కోర్కె పునరావృతం. ఎప్పుడూ నన్ను ఏదో విధంగా లొంగదీసుకోడానికే ప్రయత్నించావ్....నీ మనసు తెలుసుకోడానికే, నేను శంకర్రావుగారితో కలిసి నీముందు చిన్న అబద్ధం ఆడాను...."
తలకెక్కిన నిషాదిగిపోతోంది "అంటే..?" అడిగాను.
"నేను ఆడిందినాటకం, చెప్పింది అబద్ధం"
కళ్ళముందు మసక పొరలు తొలగిపోతున్నాయి.
ఎంత తొందరపడిపోయాను.
అవివేకం నన్ను అగాధంలోకి తోసేసింది.
"మరలా నీ మొహం నాకు చూపించకు....ఛీ...."
ఆమె వెనుదిరిగింది—వెళ్ళిపోతోంది.
"మాధురి" పిలిచాను.
ఆగిందామె.
"మనబిడ్డ యేడి ?"
"ఏ బిడ్డ"
"అదే ఆనాడు నీకు ప్రెగ్నెంట్ అని చెప్పావ్"
ఆమె పగలబడి నవ్వింది.
ఎందుకు నవ్వుతుందామె ?
ఆ నవ్వు నా ప్రాణాల్ని తోడేస్తోంది.
"అదికూడా నీ మనసు తెలుసుకోడానికి ఆడిన అబద్ధం"
అదిరిపడ్డాను.
"ఆనాడు నాకు ప్రెగ్నెన్సీ నిజంకాదు....ఈనాడు శంకర్రావుతో నా పెళ్ళి నిజంకాదు....ఇవి నీకు నేనుపెట్టిన పరీక్షలు. వీటిలో నువ్వు ఘోరంగా ఫెలయిపోయావ్...."
నా తలమీద వేయి పిడుగులుపడి ముక్కలు ముక్కలుగా గుండెల్లో గుచ్చుకుపోతున్నాయి ❋

ఖర్మ!

